

ఆలయాల హుండీల లెక్కింపు

పొన్నూరు : సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానంలోని 20 హుండీలను శుక్రవారం లెక్కించగా రూ.6.81.958 ఆదాయం వచ్చిందని ఈఓ టి.శ్రీనివాసరావు తెలిపారు.



మోస్తరు వర్షాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 29 వరకు 214.4 మి.మీ వర్షపాతం నమోదైంది.



అమరేశ్వరుని హుండీ ఆదాయం

అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి గుడిలో శుక్రవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. రూ. 7,17,328 ఆదాయం వచ్చినట్లు ఈవో గోపీనాథశర్మ తెలిపారు.

న్యూస్‌రీల్

అక్టోబర్ 3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్ : గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో అక్టోబర్ 3న పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీసీపీ, ఈసీఈ, ఏఎఫ్‌టీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థినులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజుతో సహా హాజరు కావాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులకు వసతి గృహం కలదని, వివరాలకు 9912342015 నంబర్లో సంప్రదించాలని వెల్లడించారు.

పులివెందుల స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల స్పోర్ట్స్ అకాడమీలో వివిధ క్రీడలకు సంబంధించి ప్రవేశాలు జరుగుతాయని డీఎస్‌ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ జిల్లా క్రీడాకారులకు వచ్చే నెల 3 నుంచి 5 వరకు స్థానిక బీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. హాకీ, బాడ్మింటన్, బాస్కెట్ బాల్, టెన్నిస్, వాలీబాల్ విభాగాల్లో సెలక్షన్స్ ఉంటాయని చెప్పారు. 12 నుంచి 18 సంవత్సరాల వయస్సున్న బాలురు పాల్గొనవచ్చని చెప్పారు.

అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ (బీఆర్‌ఏఓయూ) దూరవిద్య బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరేందుకు తుది గడువు ఈనెల 30న ముగియనున్నట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ అధ్యయన కేంద్ర ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా యూజీ ద్వితీయ, తృతీయ, పీజీ ద్వితీయ సంవత్సర ఫీజులను చెల్లించేందుకు సైతం తుది గడువు ఈనెల 30న ముగియనుందని పేర్కొన్నారు. వివరాలకు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం

కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆదేశాల మేరకు అక్టోబరు ఒకటో తేదీ నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో ఉదయం 10 గంటల నుంచి స్వచ్ఛ పక్వాడా-స్వచ్ఛ హీ సేవ కార్యక్రమం ఒక గంటపాటు నిర్వహించాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం ఆదేశించారు. గుర్తించిన ప్రదేశాలు, వీధులు, ప్రార్థనా మందిరాలు, విద్యా సంస్థలు, రైల్వే స్టేషన్లలో వ్యర్థాలను తొలగించి శుభ్రంచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్వయం సహాయక గ్రూపులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు పాల్గొనాలన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోండి

కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా 30వ తేదీ శనివారం ఉదయం 7.30 గంటల నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖ అధికారులతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్షపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ముందుగానే ప్రజలందరికీ సురక్ష కార్యక్రమం గురించి తెలియజేయాలని ఆదేశించారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, గర్భకోశ, ఎముకల, చెవి, ముక్కు, గొంతు, గుండె వ్యాధి వైద్య నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు. 120 రకాల మందులు అందుబాటులో ఉంటాయని వివరించారు. అవసరమైన ల్యాబ్ పరీక్షలు చేస్తారని వివరించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, డీడీవో మహాలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేత

లక్ష్మీపురం(గుంటూరు): అగతవరప్పాడు(గడ్డిపాడు) రైల్వేగేటును ట్రాక్ మరమ్మతుల నిమిత్తం అక్టోబర్ 1 నుంచి మూసివేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 5వ తేదీ వరకు గేటును మూసివేస్తున్నట్లు ప్రత్యేకంగా ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు.

పచ్చల హారమై.. ధగధగల నగమై

కొండవీడు శోభాయమానం

- మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం
- నగరవనంలో భాగంగా ప్రగతికి బాటలు
- కాలగర్భంలో కలిసిన చారిత్రక ఆనవాళ్ల వెలికితీత
- అందంగా రూపుదిద్దుకోనున్న మూడు పార్కులు
- రాజుల కాలంలో ప్రసిద్ధిగాంచిన ప్రదేశాల ఆధునికీకరణ
- అటవీశాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముందడుగు



కొండవీడు అభివృద్ధిపై అటవీశాఖ అధికారి రామచంద్రరావుకు సూచనలు చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని (ఫైల్)

యడ్లపాడు: కొండవీడు భావితరాలకు అందించాల్సిన చారిత్రక ఖజానా. ప్రకృతి రమణీయతకు ఆలవాలం.. అబ్బురపరిచే విశేషాల సమాహారం.. కళ్లు చెదిరే సుమనోహర దృశ్యాల సుందర నగం.. పచ్చదనంతో పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే అద్భుత విహారకేంద్రం.. సందర్శకులతో నిత్యం శోభిల్లుతున్న అందాల బృందా'వనం'.. అందుకే కొండవీటి కోటను మరింత అభివృద్ధి చేయాలని ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. కొండవీడు-నగరవనం కార్యక్రమం ద్వారా చారిత్రక కట్టడాల ఆధునికీకరణకూ శ్రీకారం చుట్టింది. దీనికోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రత్యేక శ్రద్ధతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయించి అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటికే ఘాట్ రోడ్డు మొదలు, స్వాగత ద్వారం, చిల్డ్రన్స్ పార్కు, చెరువుల అభివృద్ధితోపాటు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, సోలార్ దీపాలు వంటి వసతులు కల్పించారు. పర్యాటక సొబగులు అద్దారు.

చారిత్రక ప్రదేశాలకు మార్గం సుగమం

కొండపైన ఎత్తైన ప్రదేశాల నుంచి అందాలను తిలకించేందుకు వ్యూ పాయింట్లుగా ఉన్న తారా బురుజు, జెట్టిబురుజులకు ఇప్పటివరకు వెళ్లే మార్గం లేదు. పుట్టాలమ్మ చెరువు వద్ద 20 అడుగుల ఎత్తులో ఉన్న మండపాన్ని చేరుకోవాలన్నా కష్టమే. దీంతో అధికారులు ఈ మూడు చోట్ల జంగిల్ క్లియరెన్స్ చేసి సందర్శకులు వాటిని చేరుకునేలా మార్గం సుగమం చేశారు. తాజాగా శతాబ్దాల నాటి పురాతన బావి, నాడు ప్రసిద్ధి చెందిన రెండు ప్రత్యేక ప్రదేశాలను సందర్శకులకు అందుబాటులోకి తెచ్చేందుకు శ్రీకారం చుట్టారు. త్వరలోనే మేళ్లదిబ్బ, జడ్డిగాల బావి, బ్రిటిష్ కాలంనాటి గెస్ట్‌హౌస్ వెనుక ఉన్న స్థలాల్లో మొత్తం మూడు పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.



వంపుసొంపుల ఘాట్‌రోడ్డు

గెస్ట్‌హౌస్ వెనుక..

కోట గ్రామం నుంచి మెట్లమార్గం ద్వారా కొండపైకి వెళితే బ్రిటిషుల కాలంలో నిర్మించిన గెస్ట్‌హౌస్ దర్శనమిస్తోంది. దీని వెనుక భాగంలో సుమారు ఎకరం మైదాన స్థలం ఉంది. చిట్టడివిలా ఉండే ఇక్కడి ప్రదేశంలో ఎత్తైన చెట్లు ఎక్కువగా ఉన్నందుగా నిత్యం చల్లని వాతావరణం ఉంటుంది. కాబట్టే దీనిని పరిశుభ్రం చేసి సందర్శకులు భోజనాలు చేసుకుని కాస్తంత విశ్రాంతి తీసుకునేలా పార్కును తీర్చిదిద్దాలని అధికారులు చర్యలు చేపట్టారు.



పార్కు కోసం సిద్ధం చేసిన స్థలం

గృహరాజ సౌధం.. మేళ్లదిబ్బ

ఘాట్‌రోడ్డు ప్రారంభంలో చెక్‌పోస్టుకు కుడివైపున రెండెకరాల్లో ఎత్తైన ప్రదేశముంది. స్థానికులు మేళ్లదిబ్బగా పిలిచే ఈ ప్రాంతం 14వ శతాబ్దంలో గృహరాజ సౌధంగా ప్రసిద్ధి. ఇక్కడ ఒకే కలపతో దారు మందిరం(ఒకే మానుతో ఒంటి స్తంభం మేడ)ను నిర్మించారు. ఎత్తైన శిఖరాలు బంగారం, మణిమాణిక్యాలతో ధగధగలాడే ఈ సౌధంలో 'ఆదిలక్ష్మి కామేశ్వరి' అమ్మవారిని మూలస్థానంలో స్థాపించి రాజ కుటుంబీకులు మాత్రమే పూజించారని ప్రతీతి.



మేళ్లదిబ్బ ప్రాంతంలో పనులు చేస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కొండవీడు-నగరవనం కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు నిర్వహిస్తోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రత్యేక చొరతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ఇక్కడ ఒక్కొక్క ప్రాజెక్టు చొప్పున నిరంతరం ఎన్నో అభివృద్ధి పనులు చేస్తూ సందర్శకులకు అందుబాటులోకి తెస్తున్నాం.

– ఎస్.రామచంద్రరావు, జిల్లా అటవీశాఖ అధికారి

మూడు కోనేరుల సమాహారం.. జడ్డిగాల బావి



జడ్డిగాల బావి ప్రాంతం

మేళ్లదిబ్బ సమీపంలో పురాతనమైన మూడు కోనేరులు ఉన్నాయి. వీటిలో జడ్డిగాలబావి పెద్దది. ఇది 100 అడుగుల పొడవు, 35 అడుగుల వెడల్పు, 30 అడుగుల లోతైనది. ఈ బావినీటినే ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలకు, తాగునీటికి వినియోగించారని చెబుతారు. వీటిని పెదకోమిటి వేమారెడ్డి నిర్మించినట్లు చెబుతున్నా..'కళావాస్'గా ప్రసిద్ధి చెందిన కుమారగిరి రెడ్డి అని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఆయనే ఎన్నో క్రీడా సరస్సులు తవ్వించాడని, వినోద రథాలనూ తయారు చేయించాడని కవి సార్వభౌముడు శ్రీనాథుడు రచించిన ఫిరంగిపురం శాసనం వెల్లడిస్తోంది.

కోడలు కిడ్నాప్ అంటూ అత్త డ్రామా

- బంధువుల ఇంట్లో తలదాచుకున్న వివాహిత
- తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని వివరణ
- అత్త, భర్త వేధిస్తున్నారని ఫిర్యాదు

నరసరావుపేటరూరల్: తన కోడలను కిడ్నాప్ చేశారంటూ ఓ అత్త చేసిన హంగామాను డ్రామాగా పోలీసులు తేల్చారు. అత్తింట్లో వేధింపులు తట్టుకోలేక బంధువుల ఇంట్లో తలదాచుకున్న వివాహితను గుర్తించి విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం ఉప్పలపాడు సమీపంలోని జగనన్న కాలనీలో సింగులూరి నాగలక్ష్మి, తన కుమారుడు కృష్ణ, కోడలు లక్ష్మీప్రణతితో నివాసం ఉంటున్నారు. కృష్ణ, లక్ష్మీప్రణతికి ఐదేళ్ల క్రితం వివాహం కాగా తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో లక్ష్మీప్రణతి పుట్టింటికి వెళ్లి వస్తూ ఉండేది. రెండునెలల తరువాత మంగళవారం అత్తింటికి వచ్చిన లక్ష్మీప్రణతిని అత్త, భర్త వేధించడం ప్రారంభించారు. భర్త తనపై చేయిచేసుకోవడంతో తట్టుకోలేక తన బంధువులకు లక్ష్మీప్రణతి సమాచారం ఇచ్చింది. బుధవారం రాత్రి బంధువులు జగనన్న కాలనీకి వచ్చి లక్ష్మీప్రణతిని తీసుకెళ్లారు. దీనిని కిడ్నాప్‌గా చిత్రీకరించిన నాగలక్ష్మి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు నమోదు చేసుకున్న రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి లక్ష్మీప్రణతిని బంధువుల ఇంట్లో గుర్తించి విచారణ చేపట్టారు. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని అత్త, భర్త వేధింపులు తట్టుకోలేక బంధువుల ఇంట్లో తలదాచుకున్నానని స్పష్టంచేసింది. దీంతో పోలీసులు అత్త, భర్తను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు.

స్టెమితో హృద్రోగ మరణాల నివారణ

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లిలో స్టెమి ఇంజక్షన్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి : విద్యా, వైద్యరంగాల్లో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో స్టెమి కార్యక్రమంతోపాటు, దాతల సహకారంతో నిర్మించిన చిన్నారుల వైద్య విభాగ ప్రత్యేక వార్డు, విశ్రాంతి గదులను శుక్రవారం ఆయన ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ హృద్రోగ మరణాలను నివారించేందుకు ప్రభుత్వ వైద్యశాలలో రూ.40 వేల విలువైన ఇంజక్షన్లు ఉచితంగా అందించే స్టెమి కార్యక్రమం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని పేర్కొన్నారు. అనంతరం ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణ, డాక్టర్ రాజమోహన్ రెడ్డి, డాక్టర్ గిరిజ, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, ఆర్ఎంఓ శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలి

- శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: పరిశోధనల ద్వారా కొత్తరకం వంగడాలు సృష్టించిన ఎం.ఎస్.స్వామినాథన్ దేశ ప్రజల ఆకలి తీర్చారని శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కొనియాడారు. ఆయన కృషితోనే దేశానికి ఆహారభద్రత లభించిందన్నారు. అటువంటి వ్యక్తి మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఎం.ఎస్.స్వామినాథన్‌కు కేంద్రప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని ఉమ్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. స్వామినాథన్‌తో వ్యక్తిగతంగా తనకున్న అనుబంధాన్ని శనివారం బాపట్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన గుర్తుచేసుకున్నారు. బాపట్ల వ్యవసాయకళాశాల విద్యార్థిగా, ఆ తరువాత బోధకుడిగా కొనసాగిన తనకు స్వామినాథన్‌తో అనుబంధం ఉందన్నారు. వ్యవసాయ కళాశాల ప్రారంభంలో ఇక్కడికి అధ్యాపకులను ఆయనే పంపారని గుర్తుచేసుకున్నారు. 1989, 1996, 2006 సంవత్సరాల్లో స్వామినాథన్ బాపట్లను సందర్శించారని వివరించారు. 2006లో తన ఇంటికి వచ్చారని, ఈ సందర్భంగా ఆయనను సన్మానించినట్లు ఉమ్మారెడ్డి వెల్లడించారు. బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన ఎంవీ రెడ్డితో కూడిన శాస్త్రవేత్తల బృందం బీపీటీ 5204 సాంబమసూరి రకం వరి వంగడాన్ని సృష్టించినప్పుడు స్వామినాథన్ అభినందించారని, సాంబమసూరి రకాన్ని అంతర్జాతీయ స్థాయికి పరిచయం చేసిన వ్యక్తి ఆయనేనని ఉమ్మారెడ్డి కొనియాడారు. ఆయన 70వ పుట్టినరోజు సందర్భంగా స్వయంగా వెళ్లి స్వామినాథన్ ఫౌండేషన్‌కు రూ.70 వేలు అందజేసినప్పుడు చాలా సంతోషపడ్డారని ఉమ్మారెడ్డి చెప్పారు. స్వామినాథన్‌తో అనుబంధం మరువలేనిదన్నారు.

కన్ను పడిందా కన్నమే

- దొంగల ముఠా అరెస్టు
- పట్టించిన సీసీ కెమెరాలు
- విచారణలో బయటపడిన మరిన్ని చోరీలు
- రూ 22.7 లక్షల విలువైన వస్తువులు, నగదు రికవరీ
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



స్వాధీనం చేసుకున్న నగదు, నగలను చూపిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి చిత్రంలో డీఎస్పీ ఆదినారాయణ, సీఐ ప్రేమయ్య

సాక్షి, నరసరావుపేట: సత్తెనపల్లి, గురజాల సబ్ డివిజన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను సత్తెనపల్లి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ముగ్గురు సభ్యులు ఉన్న ఈ గ్యాంగ్ కన్ను ఏ ఇంటిపైనైనా పడిందంటే కన్నం వేయాల్సిందే. పగలు, రాత్రి అనే భేదం అసలు ఉండదు. ఇప్పటివరకు ఈ ముఠా ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏడు చోరీలకు పాల్పడింది. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి తన కార్యాలయంలో కేసు వివరాలను విలేకరులకు వివరించారు. ఆయన కథనం ప్రకారం..

నకరికల్లు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉండే షేక్ జైనబ్ కుటుంబం ఈ నెల 5న పని నిమిత్తం నరసరావుపేటకు వెళ్లింది. మధ్యాహ్నం 3.20 గంటల సమయంలో దొంగల ముఠా ఇంటి తాళాలు పగలగొట్టి 150.696 గ్రాముల బంగారం, రూ.7.50 లక్షల నగదును అపహరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నకరికల్లు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ దొంగ నడక ఆధారంగా నిందితులను గుర్తించారు. గురజాల పట్టణానికి చెందిన రుద్రాల సురేష్, మహంకాళి గణేష్, ఎక్కులూరి నరేష్ ఈ చోరీ చేసినట్టు విచారణలో తేలింది. సత్తెనపల్లి రూరల్ సీఐ ప్రేమయ్య శుక్రవారం తన సిబ్బందితో కారెంపూడి క్రాస్ రోడ్డు వద్ద కారులో వెళ్తున్న ముగ్గురు దొంగలను అరెస్ట్ చేశారు.

90 శాతానికి పైగా సొత్తు రికవరీ...

ముగ్గురు దొంగలను వేరువేరుగా పోలీసులు విచారణ చేశారు. దీంతో ఈ ఏడాదిలో తాము ఏడు దొంగతనాలు చేసినట్టు వారు ఒప్పుకున్నారు. అన్ని చోరీల్లో కలిపి సొత్తు విలువ రూ.24.5 లక్షలుగా పోలీసులు లెక్కకట్టారు. ఇందులో రూ.22.70 లక్షల విలువైన బంగారం, నగదును పోలీసులు రికవరీ చేశారు. మొత్తం 363.95 గ్రాముల బంగారాన్ని వీరు అపహరించగా మొత్తం రికవరీ చేయడం విశేషం. వీరి నుంచి మారుతీ షిఫ్ట్ డిజైర్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఈ ముగ్గురూ స్నేహితులు. కార్లను బాడుగకు తీసుకొని తాళాలు వేసిన ఇళ్లను రెక్కీ చేసి, డ్రైవర్ సహాయంతో తాళాలు పగలుగొట్టి చోరీలు చేయడం వీరికి వెన్నతోపెట్టిన విద్య. గతంలో రుద్రాల సురేష్ మీద 14 కేసులు, మహంకాళి గణేష్ మీద 3 కేసులు నమోదయ్యాయి. తక్కువ సమయంలో నిందితులను పట్టుకొని, వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకొన్న సీఐ ప్రేమయ్య, సిబ్బందిని ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు అందించారు. సమావేశంలో సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, సీఐ ప్రేమయ్య, ఎస్ఐ బాలకృష్ణ, ఇతర పోలీసుల పాల్గొన్నారు.

సంక్షేమ హో'రన్'

- డ్రైవర్లకు ఆర్థిక భరోసా
- జిల్లాలో 8,462 మందికి వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధి
- రూ.8.4 కోట్ల మేర ప్రయోజనం



వైఎస్సార్ వాహన మిత్ర నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, రవాణాశాఖ అధికారులు

నరసరావుపేట: ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందే ప్రతిఒక్కరూ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగే ప్రయత్నం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. శుక్రవారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ వాహనమిత్ర పథకం ఐదో విడత నిధుల జమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి రవాణాశాఖ అధికారులు, ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లతో కలిసి వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది పథకం ద్వారా పల్నాడు జిల్లాలో 8,462 మందికి రూ.8.4 కోట్లు మంజూరు చేసినట్టు వివరించారు. అనంతరం నమూనా చెక్కును డ్రైవర్లకు అందజేశారు. అసిస్టెంట్ కలెక్టర్ ఎం.ఆర్.కల్పశ్రీ, జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ టి.కె.పరంధామరెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ ప్రసాద్, శివనాగేశ్వరరావు, నాగలక్ష్మి, వాహన మిత్ర డ్రైవర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష సమర్థంగా అమలు చేయండి

కమిషనర్ సూర్యకుమారి, కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి, రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వైద్య శాఖ మంత్రి విడదల రజిని ఈ జిల్లా అనే విషయం అధికారులకు గుర్తు చేశారు. అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేస్తేనే విజయవంతమవుతుందని పేర్కొన్నారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీరికి పలు సూచనలు చేశారు. వాటిపై కమిషనర్ సూర్యకుమారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి పాల్గొన్నారు.

భారతీస్వామికి గౌరవ డాక్టరేట్



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న నిత్య విద్యానంద భారతీస్వామి

నాదెండ్ల: గణపవరం ఆదిపరాశక్తి పీఠాధిపతి నిత్య విద్యానంద భారతీస్వామికి ప్రపంచ మానవహక్కుల పరిరక్షణ కమిషన్ నుండి గౌరవ డాక్టరేట్ దక్కింది. ఈ నెల 26న ఢిల్లీలో జరిగిన మానవ హక్కుల పరిరక్షణ విభాగం సభలో ఆయనకు సంస్థ మేనేజర్, డైరెక్టర్ల చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. కొన్నేళ్లుగా స్వామిజీ చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్ అందించినట్లు కమిషన్ ప్రతినిధులు తెలిపారు. 26 ఏళ్లుగా సమాజ సేవ, ఉచిత విద్య, అన్నదానం, ఆరోగ్య పరిరక్షణ, సనాతన ధర్మ పరిరక్షణ, సెమినార్లు నిర్వహించటంతో ఈ అరుదైన గౌరవం దక్కింది. స్వామిజీ సేవలను గుర్తించిన లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అవకాశం కల్పించారు.

ఇకపై వెబ్‌ల్యాండ్‌లోనే భూముల వివరాలు

- పల్నాడు జిల్లా జేసీ ఎ శ్యామ్‌ప్రసాద్
- యడ్లపాడు సచివాలయం-1 ఆకస్మిక సందర్శన
- రీసర్వే వెబ్‌ల్యాండ్-2 పోర్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలన
- రెండు గ్రామాల రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ



రీసర్వే పూర్తయిన గ్రామ వాసులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: రెవెన్యూ దస్త్రాల్లోని సర్వే నంబర్ల కథ సమాప్తం అయిందని..రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని భూముల వివరాలన్నీ ఇకపై వెబ్ ల్యాండ్-2 పోర్టర్ ద్వారా అమలు అవుతోందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. యడ్లపాడు-1 గ్రామ సచివాలయాన్ని జేసీ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న వైఎస్సార్ జగనన్న భూహక్కు-భూరక్ష కార్యక్రమంలో భాగంగా రీసర్వే పూర్తి చేసి వెబ్ ల్యాండ్ -2లో నమోదు చేసిన వివరాలను సచివాలయం కంప్యూటర్‌లలో స్వయంగా పరిశీలించారు. రీసర్వే అమలుపై రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

జేసీ మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ -2 పోర్టర్ పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చినట్లు వెల్లడించారు. భూముల క్రయ, విక్రయాలు, భాగ పంపిణీ, మార్పులు, చేర్పులు తదితర కార్యక్రమాలన్నీ స్థానిక గ్రామ సచివాలయాల పరిధిలోనే నిర్వహించుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. నరసరావుపేట డివిజన్ పరిధిలో ఇప్పటికీ రెండు విడతలు సర్వే చేసినట్లు చెప్పారు. మొదటి విడతగా 52 గ్రామాలు, రెండో విడతలో 45 చొప్పున మొత్తం 97 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ విజయవంతంగా ముగిసిందన్నారు.

గతంలో గ్రామాల్లో సర్వే నంబర్ల ఆధారంగా వెబ్ ల్యాండ్ -1లో భూముల వివరాలు రెవెన్యూ కార్యాలయాల్లో ఉండేవన్నారు. రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో ఆయా భూముల వివరాలను ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ నంబర్ల) వారీగా వెబ్ ల్యాండ్ -2 పోర్టర్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. దీంతో భూముల రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్, సవరణలు గ్రామ సచివాలయల్లోనే చేసుకోవచ్చన్నారు.

ప్రభుత్వ నిర్దేశిత సేవా రుసుం చెల్లించి తమ దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు. యజమాని తమ భూమి అమ్మకానికి లేదా భాగ పంపిణీ చేస్తున్నా భూమికి ప్రత్యేక సబ్‌డివిజన్ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు తాను అర్జీ పెట్టుకున్న 15 రోజుల్లో కొలతలు, సబ్‌డివిజన్ నిర్వహణ పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

భూహక్కు పత్రాలు పంపిణీ..

రెండు విడతల్లో రీసర్వే పూర్తయిన అన్నీ గ్రామాలకు యజమానులకు భూహక్కు పత్రాలు ఆయా తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చాయన్నారు. వీటిని వీఆర్వోలు నేరుగా సంబంధిత యజమానికే పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వలంటీర్ లాగిన్‌లో ఈకేవైసీ చేసిన పిదప వీటిని ఇస్తున్నట్లు తెలిపారు. తాజాగా మండలంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన వినతుల్ని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే పూర్తయి మండలాలకు వచ్చిన భూహక్కు పత్రాల్ని వెంటనే పంపిణీ చేయాలన్నారు. యడ్లపాడు, వంకాయలపాడు రైతులకు కొత్తగా వచ్చిన భూహక్కు పత్రాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీతో పాటు నియోజకవర్గ ఎన్నికల అధికారి జి వసంతబాబు, తహసీల్దార్ జి సుజాత, డీటీ శ్యామలత, ఆర్ఐ చక్రవర్తి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన పనులను గుర్తించాలి

డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి గ్రామసభల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ తయారు చేయాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సత్తెనపల్లి క్లస్టర్ పరిధిలోని తొమ్మిది మండలాల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని ప్రతి గ్రామంలో ఆ గ్రామంలో ఏ పనులైతే అవసరమో వాటిని గుర్తించి గ్రామసభల ద్వారా లేబర్ బడ్జెట్ తయారు చేయాలన్నారు. తద్వారా ఆ గ్రామంలోని కూలీలకు పనులు కల్పించడంతో పాటు ఆ పనులు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయ న్నారు. ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టంపై సమీక్ష చేశారు. రికార్డ్స్, రిజిస్టర్లు, జాబ్ కార్డులు ఫీల్డ్ అసిస్టెంట్లతో అప్డేట్ చేయించాలన్నారు. శిలా ఫలకాలు, మెటీరియల్ పేమెంట్, పండ్ల తోటలు తదితర వాటిపై సమీక్ష చేశారు. గృహ నిర్మాణానికి సంబంధించి 90 రోజుల మస్టర్ పేమెంట్ చేయాలన్నారు. చేపట్టిన పనులను జియో ట్యాగ్ చేసి పని పూర్తి చేయాలన్నారు. పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏపీడీ పీ.వెంకటనారాయణ, క్లస్టర్ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, మండలాలకు చెందిన ఏపీవోలు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా సీడీ జోసఫ్‌కుమార్, పక్కన ఏపీడీ వెంకట నారాయణ

సవాళ్లను అధిగమిస్తేనే విజయం

గుంటూరు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ దోనవల్లి లక్ష్మణ్

చేబ్రోలు: ఫార్మాస్యూటికల్ విద్యార్థులు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తేనే విజయం సాధించగలరని గుంటూరులోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ దోనవల్లి లక్ష్మణ్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ''ప్రివెంటివ్ అండ్ ఎమర్జెన్సీ మెడికల్ సైన్సెస్'' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కాన్ఫరెన్స్‌ను ''ఏ పారాడిమ్ షిఫ్ట్ ఆఫ్ క్లినికల్ ప్రాక్టీస్ ఫ్రమ్ హాస్పిటల్ టు కమ్యూనిటీ ఎట్ లార్జ్'' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం కారే మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ విద్యార్థులకు మన దేశంతో పాటు, ఇతర దేశాలలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 410 మంది హాజరయ్యారు. చైర్మన్ లావు రత్తయ్య, సోమశేఖర రెడ్డి, ప్రిన్స్ అభిషేక్, ప్రిన్సిపల్ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

జిల్లాలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వీరే

ఉత్తర్వులు జారీచేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో గల 28 మండలాలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి.

- నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్లకు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, నరసరావుపేటకు తన్నీరు శ్రీనివాసరావు, నరసరావుపేట క్లస్టర్-1, 2లకు ఎస్.ఏ.హనీఫ్ నియమితులయ్యారు.
- చిలకలూరిపేట నియోజకవర్గంలోని నాదెండ్లకు మద్దూరి కోటిరెడ్డి, యడ్లపాడుకు గంటా శంకర్, చిలకలూరిపేట రూరల్‌కు గుత్తా వేమలయ్య, చిలకలూరిపేట క్లస్టర్-1కు తలహా ఖాన్, క్లస్టర్-2కు విడదల కమలేంద్ర నియమితులయ్యారు.
- సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెంకు వేపూరి శ్రీనివాసరావు, ముప్పాళ్లకు నక్కా శ్రీనివాసరావు, నకరికల్లుకు భవనం రాఘవరెడ్డి, సత్తెనపల్లి రూరల్‌కు రాయపాటి పురుషోత్తమరావు, సత్తెనపల్లి మున్సిపాలిటీకి షేక్ మౌలాలి నియమితులయ్యారు.
- గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల అధ్యక్షులుగా చల్లా పిచ్చిరెడ్డి, పిడుగురాళ్ల మున్సిపాలిటీకి చింతా వెంకటరామారావు, మాచవరం చౌదరి సింగ్రయ్య, దాచేపల్లికి కోట కృష్ణ, దాచేపల్లి పట్టణానికి షేక్ మహబూబ్ సుభాని(టొమాటో), గురజాలకు సిద్ధవు గాంధీ, గురజాల నగర పంచాయతీకి కుక్కమూడి అన్నారావు నియమితులయ్యారు.
- మాచర్ల నియోజకవర్గంలోని దుర్గికి ఉన్నం వెంకటేశ్వర్లు, కారంపూడికి కొంగర సుబ్రమణ్యం, మాచర్లకు అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెల్దుర్తికి కోట్ల పాపిరెడ్డి, మాచర్ల మున్సిపాలిటీకి పోలా శ్రీనివాసరావు, రెంటచింతలకు గొట్టం బ్రహ్మారెడ్డి నియమితులయ్యారు.
- వినుకొండ నియోజకవర్గంలో బొల్లాపల్లికి మత్తి రాజయ్య, ఈపూరుకు కోపెల దేవరాజ్, శావల్యాపురంకు భీమని అంకారావు, నూజెండ్లకు నక్కా నాగిరెడ్డి, వినుకొండ రూరల్‌కు దండు చెన్నయ్య, వినుకొండ మున్సిపాలిటీకి పీఎస్ ఖాన్ నియమితులయ్యారు.
- పెదకూరపాడు నియోజకవర్గంలోని పెదకూరపాడుకు షేక్ మస్తాన్‌షరీఫ్, బెల్లంకొండకు ఓర్సు సాంబశివరావు, క్రోసూరుకు వేలాది అప్పారావు, అచ్చంపేటకు చిలకా చంద్రయ్య, అమరావతికి భవిరిశెట్టి హనుమంతరావు నియమితులయ్యారు.

నరసరావుపేటలో ముస్లింల మిలాద్-ఉన్-నబీ ర్యాలీ

ర్యాలీని ప్రారంభించి పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మన దేశం మతసామరస్యానికి ప్రతీకని, దానిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మిలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. గుంటూరు రోడ్డులోని నాయబ్ బజార్ పెద్ద మసీదు వద్ద నుంచి లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ మీదుగా తిరిగి మసీదు వరకు ర్యాలీ కొనసాగింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ర్యాలీని ప్రారంభించి, పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త సల్లేవుల్లాహు వసల్లం అడుగుజాడల్లో నడవాలని అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు 'మీలాద్-ఉన్-నబీ' పేరుతో పండుగ నిర్వహించుకుంటారన్నారు. ఆ ప్రవక్త కేవలం ముస్లింలకే కాకుండా యావత్తు మానవాళికి ప్రవక్తగా పంపడం జరిగిందన్నారు. ఒక మనిషి జీవన శైలి భూమిపై సన్మార్గంలో కొనసాగించాలని చెప్పారన్నారు. ప్రజలు, రైతులు సుఖ శాంతులతో సుభిక్షంగా ఉండాలని ఆ దేవున్ని ప్రార్థించామన్నారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.



ర్యాలీలో ముస్లింతో కలిసి నడుస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నేడు లైవ్ ఐసీయూ ప్రారంభం

గుంటూరుమెడికల్: దేశంలోనే మొట్టమొదటిసారిగా లూసిడ్లీ ఇంటిగ్రేటెడ్ వైటల్ కేర్ ఇన్ ఎమర్జన్సీ (లైవ్) కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఏరియా హాస్పటల్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని శనివారం ప్రారంభిస్తారని శ్రీ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి చెప్పారు. శుక్రవారం గుంటూరు అరండల్‌పేటలోని సమిష్టి హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (శ్రీ)లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత ఆధునికమైన స్మార్ట్ ఐసీయూ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఐసీయూను మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారన్నారు. అత్యవసర చికిత్సల కోసం ఐసీయూకు వచ్చే రోగుల ప్రాణాలను రక్షించడమే ధ్యేయంగా లైవ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం అత్యాధునిక ఐసీయూ సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. తొలుత పైలెట్ ప్రాజెక్టుగా చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో శనివారం ఉదయం 10 గంటలకు మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారన్నారు. అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగుల ఆరోగ్య పరిస్థితి ప్రతి నిమిషం స్మార్టు ఐసీయూ ద్వారా క్రిటికల్ కేర్ వైద్యులకు సమాచారం ఆన్‌లైన్ ద్వారా వస్తుందన్నారు. గుంటూరులోని శ్రీహాస్పటల్‌లో ఐసీయూ స్పెషాలిటీ వైద్యులు సదరు సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు తక్షణ చికిత్సకు సూచనలు, సలహాలు అందజేస్తారన్నారు.

ఏడు నుంచి డీఆర్‌ఎం కప్ క్రీడా పోటీలు

- 6లోపు నమోదు చేసుకోవాలి
- పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడించిన డీఆర్‌ఎం

లక్ష్మీపురం: మొట్టమొదటి సారిగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని అధికారులు, ఉద్యోగస్తులు, డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనే విధంగా డీఆర్‌ఎం కప్‌ను నిర్వహిస్తున్నామని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో డీఆర్‌ఎం కప్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడా పోటీలలో పాల్గొనేందుకు అక్టోబర్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకుని నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్రికెట్ పోటీలు అక్టోబర్ 7,8,14,15వ తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు. 12 ఓవర్స్‌తో క్రికెట్ ముగుస్తుందన్నారు. విజేతలకు రూ.75 వేల క్యాష్ ప్రైజ్, రన్నర్స్‌కు రూ.50 వేలు బహుమతులుగా అందజేస్తామన్నారు. ఈ క్రికెట్ పోటీలకు వచ్చే క్రీడాకారులు పూర్తి టీంతో రావల్సిందిగా కోరారు. వాలీబాల్ అక్టోబర్ 7,8 తేదీలలో గుంటూరు పట్టాభిపురం డీఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. వాలీబాల్ ప్రవేశ రుసుం రూ.1000, విన్నర్స్ రూ.10 వేలు, రన్నర్స్ రూ.5 వేలు, మూడోస్థానంకు రూ.3వేలు, నాల్గవ స్థానంకు రూ.2 వేలు కేటాయించామని తెలిపారు. బ్యాడ్మింటన్ పోటీలను అక్టోబర్ 7,8 తేదీలలో పట్టాభిపురం డీఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీలకు రూ.1000 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. ఈ పోటీలలో విజేతలకు రూ.10 వేలు, రన్నర్స్‌కు రూ.5 వేలు, మూడో స్థానం వారికి రూ.3 వేలు, నాల్గొవ స్థానం వారికి రూ.2వేలు నిర్ణయించడం జరిగిందన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ఉద్యోగస్తులు, అధికారులతోపాటు డివిజన్ పరిధిలోని క్రీడాకారులు ఎవరైనా పాల్గొనవచ్చని అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, నల్గొండ, యాదాద్రి జిల్లాలకు చెందిన ఆధార్ కార్డులు కలిగి ఉండాలని లేని వారికి ప్రవేశం ఉండదని తెలిపారు. ఈ పోటీలలో నిర్ణయం అంపైర్‌దేనన్నారు. ఆసక్తి గల క్రీడాకా రులు 6వ తేదీలోగా రైల్వే అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. గీతా, ఓఎస్‌డి 9121139141, వై.శ్రీనివారావు కో ఆర్డినేటర్ 9347785888 నంబర్లను సంప్రదించాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ, పక్కన ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, సైమన్, దినేష్

అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

జే.పంగులూరు: అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితులను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు తిరుమల్లవయురుకు చెందిన ధనుష్, తుని మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన కిల్లి మురళి నిందితులు మండల పరిధిలోని కొండమంజులూరు క్రాస్ రోడ్డు వద్ద ఈ నెల 28వ తేది రాత్రి 9 గంటల సమయంలో జాతీయ రహదారిపై కారులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండగా రేణింగవరం పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 22 కేజీల స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరిచారు. అంతరాష్ట్ర గంజాయి ముఠాని పట్టుకున్న సీఐ ఉమేష్, ఎస్సై కేకే తిరుపతిరావును సిబ్బందిని బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.



పట్టుకున్న గంజాయి ప్యాకెట్లతో ఎస్సై తిరుపతిరావు

యువతిని కాపాడిన తాడేపల్లి పోలీసులు

తాడేపల్లిరూరల్: స్థానిక పోలీసులకు మరోసారి అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం అర్ధరాత్రి విజయవాడ రాణిగారి తోటకు చెందిన ఓ యువతి ఇంట్లో తల్లిదండ్రులతో గొడవ పడడంతో ఇంట్లో నుంచి తన ద్విచక్ర వాహనంపై కనకదుర్గ వారధి మీదుగా తాడేపల్లి వచ్చి గుంటూరు రోడ్డులో నుంచి విజయవాడ వెళ్లే వారధి రహదారిలో 26-27 పిల్లర్ల వద్ద బండి పార్క్ చేసి ఆ యువతి కృష్ణా నదిలోకి దూకింది. అది గమనించిన ఓ యువకుడు 122కు సమాచారం అందించడంతో అటు విజయవాడ పోలీసులు, ఇటు తాడేపల్లి పోలీసులు కనకదుర్గ వారధి వద్దకు చేరుకున్నారు. మొదటగా తాడేపల్లి ఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, బీట్ కానిస్టేబుల్ షరీఫ్ స్వామిలతో కలసి కృష్ణానదిలోకి వెళ్లారు. కృష్ణానది కనకదుర్గ వారధిపై కొంతమంది సిబ్బందిని పంపి యువతి ద్విచక్రవాహనం ఉన్న ప్రాంతం వద్ద చూడాలని సూచించారు. సుమారు 1.5 కిలోమీటర్లు ఇసుకలో నడుచుకుంటూ వెళ్లి కృష్ణానది నీటిలో అపస్మారక స్థితిలో పడిఉన్న యువతిని గుర్తించారు. ఒడ్డుకు తీసుకు వచ్చి నీటిని కక్కించి, ప్రాథమిక చికిత్స చేశారు. అప్పటికీ ఆ యువతి తేరుకోకపోవడంతో దుప్పటి సాయంతో యువతిని మోసుకుంటూ వారధి వద్దకు తీసుకు వచ్చారు. అప్పటికే 108 సిబ్బందిని సిద్ధంగా ఉంచడంతో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే యువతి ఆరోగ్యానికి ఎటువంటి ఢోకా లేదని డాక్టర్లు చెప్పడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అర్ధరాత్రి యువతిని కాపాడిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. తమ సిబ్బంది సకాలంలో స్పందించి అతి కష్టం మీద యువతిని బయటకు తీసుకు వచ్చి ప్రాణాలు కాపాడారంటూ ప్రశంసించారు. అలాగే పోలీసులకు సమాచారం ఇచ్చిన యువకుడికి కూడా పోలీస్‌శాఖ తరుపున అభినందనలు తెలియజేశారు. తాడేపల్లి ఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణలను జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ రాంబాబు, సీఐ శేషగిరి రావు, పెదకాకాని సీఐ సురేష్ బాబులు అభినందించారు.